**పత్ర-పుష్పము**

**"విశ్వ నవ నిర్మాణము కొరకు నిర్మానతా గుణాన్ని ధారణ చేయండి, నిర్మలంగా (స్వచ్ఛంగా) కండి"**

**(20-06-23)**

ప్రాణప్రదమైన అవ్యక్తమూర్త్ మాత–పిత బాప్‌దాదాకు అతి ప్రియమైనవారు, సదా నిర్మల మరియు నిర్మాన స్వభావం కలవారు, సదా ప్రసన్నచిత్త స్థితిలో ఉంటూ అందరికీ శీతలత అనే నీడను అందించేవారు, విశ్వ నవ నిర్మాణానికి నిమిత్తులైన దేశ–విదేశాలలోని నిమిత్త టీచర్ అక్కయ్యలందరూ మరియు సర్వ బ్రాహ్మణ కుల భూషణ సోదరీ–సోదరులు, ఈశ్వరీయ స్నేహ సంపన్నమైన మధుర స్మృతులను స్వీకరించండి.

తర్వాత సమాచారమేమనగా – బ్రాహ్మణ పిల్లలైన మనందరి హృదయాలలో జూన్ మాసంలో మధురమైన జగదాంబ తల్లి యొక్క విశేష స్మృతులు ఉంటాయి. మధురమైన తల్లి పిల్లలైన మనందరికీ సదా ఫాలో ఫాదర్ చేసేందుకు ప్రేరణలు ఇచ్చారు. ఏ విధంగా వారు స్వయం హాజీ పాఠంలో పక్కాగా ఉండేవారో, ప్రతి ఘడియను అంతిమ ఘడియగా భావించి ఎవర్‌రెడీగా ఉండేవారో మరియు నంబరువన్‌లోకి వెళ్ళిపోయారో, అదే విధంగా మనమందరమూ వారి అడుగులపై అడుగులు వేస్తూ తండ్రి సమానంగా సంపన్నంగా–సంపూర్ణంగా అయ్యే రేస్ చేస్తున్నాము. ఇప్పుడు ఈ జులై మాసం మధురమైన మన్‌మోహినీ దీదీగారి స్మృతుల మాసము. వారు దృఢత్వంతో ప్రతి ఈశ్వరీయ నియమాన్ని మరియు మర్యాదను పాలన చేసారు మరియు చేయించారు. వారి జీవితంలో సోమరితనం మరియు నిర్లక్ష్యం యొక్క నామ–రూపాలు కూడా ఉండేవి కాదు. అమృతవేళ నుండి రాత్రి వరకు దినచర్యలో సదా ఏక్యురేట్‌గా ఉండేవారు, అలర్ట్‌గా ఉండేవారు. ప్రతి ఒక్కరికీ పితావ్రతా మరియు పతివ్రతా పాఠాన్ని పక్కా చేయించారు. అంతిమ సమయంలో "అబ్ ఘర్ జానా హై" (ఇప్పుడిక ఇంటికి వెళ్ళాలి) అని సదా ఇదే స్మృతిలో ఉంటూ ఉపరామంగా, అతీతంగా, ప్రియంగా అయ్యి సంపన్నమయ్యారు. ఇటువంటి పూర్వజులైన ఆది రత్నాల యొక్క అలౌకిక పాలనకు ఇప్పుడు మనమందరము రిటర్న్ ఇవ్వాలి.

సమయమనుసారంగా ఇప్పుడు విశ్వ నవ నిర్మాణం అనే గొప్ప కార్యాన్ని సంపన్నం చేసేందుకు బాబా అంటారు – పిల్లలూ, నిర్మలంగా మరియు నిర్మానులుగా కండి. ఏ విధంగా బ్రహ్మాబాబా యొక్క ప్రతి మాటలో నమ్రత, మధురత మరియు మహానత స్పష్టంగా కనిపించేవో, సదా చేయించేవారి స్మృతితో ప్రతి కర్మలో అతీతంగా మరియు నిరహంకారిగా ఉన్నారో, అదే విధంగా మనందరి ద్వారా జరిగే ప్రతి కర్మలో నమ్రతా స్వరూపంతో కూడిన నవ నిర్మాణం యొక్క శ్రేష్ఠత నిండి ఉండాలి. ప్రతి క్షణము, ప్రతి సంకల్పము సంపూర్ణ పవిత్రంగా అనగా స్వచ్ఛంగా ఉండాలి. మరి చెప్పండి, ఇటువంటి లక్ష్యాన్ని పెట్టుకుని స్వ మరియు సేవల బ్యాలెన్స్ ఉంచుతూ సదా ముందుకు వెళ్తూ ఉంటారు కదా!

ఇప్పుడు జులై–ఆగస్టు మాసాలలో భారత్‌లో నలువైపులా వర్షపు జల్లుల సందడి ఉన్నప్పుడు, ఇటువంటి సమయంలో మనమందరమూ విశేషంగా తపస్య చేయాలి. యోగాగ్నితో మన పాత సంస్కారాలను, వికర్మలను భస్మం చేసుకోవాలి. అంతేకాక మన శ్రేష్ఠ జీవితంతో, నడవడిక మరియు ముఖంతో పరమాత్మ ప్రత్యక్షతకు నిమిత్తులుగా అవ్వాలి.

ఈ సమయంలో మధుబన్‌లో నిత్యం బాబా యొక్క కొత్త–పాత పిల్లల సందడి చాలా బాగుంది. ఒక వైపు రాజయోగ శిబిరాలలో వేలాది సంఖ్యలో బాబా యొక్క కొత్త–కొత్త పిల్లలు మధుబన్ ఇంట్లో అలౌకిక అనుభూతులను పొందుతున్నారు. రెండవ వైపు వేర్వేరు వర్గాల వారి సెమినార్లు, వర్క్‌షాప్‌లు మొదలైనవి జరుగుతూ ఉన్నాయి మరియు మూడవ వైపు యోగ తపస్య కోసం కూడా అనేకమంది సోదరీ–సోదరులు ఎంతో ఉల్లాస–ఉత్సాహాలతో వస్తున్నారు. బాబా తన పిల్లలను అన్ని రకాలుగా జ్ఞాన–యోగాల ఖజానాతో నిండుగా చేస్తున్నారు. జులై మాసంలో శాంతివన్‌లో టీచర్ అక్కయ్యలు, సమర్పిత అన్నయ్యలు, కుమారులు, అధర్ కుమారులు, మాతలు మొదలైనవారి కోసం యోగ భట్టీలు పెట్టడం జరిగింది. నేను స్వయం సంపన్నంగా అయ్యి సమయాన్ని సమీపంగా తీసుకురావాలి అన్న తపన బాబా పిల్లలు ప్రతి ఒక్కరిలో ఉంది. ఈ లక్ష్యముతోనే అందరూ మధుబన్‌కు వస్తారు, చాలా మంచి అనుభవాలను పొంది వెళ్తారు. అచ్ఛా – మీ అందరి ఆరోగ్యము బాగుంది కదా. అందరికీ చాలా–చాలా స్మృతులు...

**ఈశ్వరీయ సేవలో,**

**బి.కె.రతన్ మోహినీ దాదిగారు**

## అవ్యక్త ప్రేరణలు

## "నిర్మలంగా మరియు నిర్మానంగా అయ్యి విశ్వ నవ నిర్మాణం చేయండి"

1. తమ స్వభావాన్ని నిర్మలంగా (శీతలంగా, శుద్ధంగా) చేసుకున్నట్లయితే ప్రతి కార్యంలో సఫలత లభిస్తూ ఉంటుంది. ఇప్పుడు నిర్మల స్వభావంపై విశేషంగా అండర్‌లైన్ చేయండి. ఏది ఏమైనా సరే మీ స్వభావం సదా నిర్మలంగా ఉండాలి. 'నిర్మల స్వభావము' అనగా పూర్తిగా శీతలము, శుద్ధము. ఏదైనా ఆవేశం కలిగించే విషయం ఉన్నా సరే మీరు నిర్మలంగా ఉండండి. పరివర్తనా శక్తి ఆధారంగా క్షణంలో బిందువు పెట్టండి, లోపల అలజడి ఉండకూడదు, అప్పుడు నిర్మలంగా మరియు నిర్మానంగా ఉన్నారని అంటారు.

2. ఏ పిల్లల స్వభావము నిర్మలంగా ఉంటుందో, వారు ఆలోచనలను ఇవ్వడం మరియు తీసుకోవడంలో సరళంగా ఉంటారు, ఏ సేవలోనూ విఘ్న రూపులుగా అవ్వరు. వారికి – నా ఆలోచన, నా ప్లాన్, నా సేవ, ఇవి ఇంత బాగున్నా సరే నాది ఎందుకు అంగీకరించలేదు... అన్న సంకల్పం కూడా రాదు. ఈ నాది అనేది రావడము అంటే కల్తీ కలిసినట్లు.

3. ఏ పిల్లలైతే సదా నిర్మల మరియు నిర్మాన స్వభావం కలవారిగా ఉంటారో, వారి మనసు-బుద్ధిలో వ్యర్థం యొక్క గతి తీవ్రంగా ఉండదు. వారు నిర్మలంగా మరియు నిర్మానంగా ఉన్న కారణంగా అందరికీ ప్రసన్నచిత్తత అనే నీడలో శీతలతను ఇస్తారు. అగ్ని సమానంగా రగిలిపోతున్న, క్రోధం కలవారైనా సరే ప్రసన్నచిత్తత యొక్క వైబ్రేషన్స్ అనే నీడ వారిని శీతలంగా చేస్తుంది.

4. పూర్వజ మరియు పూజ్య ఆత్మలైన మీ స్మృతి చిహ్నాలలో కూడా నయనాలను సదా నిర్మలంగా చూపిస్తారు. ఎప్పుడూ కూడా అభిమానం లేక అవమానాన్ని కనబరిచే నయనాలను చూపించరు. దేవీ-దేవతల నయనాలు నిర్మలంగా మరియు ఆత్మికంగా ఉంటాయి. కావున ఎప్పుడైనా ఎవరి పట్లనైనా ఏదైనా నెగెటివ్ సంకల్పం వస్తే- నేను ఎవరు అన్నది గుర్తు తెచ్చుకోండి. నా జడ చిత్రాలే ఆత్మిక నయనాలు కలవిగా ఉన్నప్పుడు మరి నేనైతే చైతన్యంలో ఉన్నాను కదా.

5. నమ్రచిత్తులు మరియు నిర్మల స్వభావం కలవారు ఎవరైతే ఉంటారో, వారికి ఎప్పుడూ స్వయం యొక్క సఫలత గురించి అభిమానం ఉండదు. వారు దానిని వర్ణించరు, వారు స్వయం యొక్క మహిమను చేసుకోరు, ఇతరులు వారి మహిమను చేస్తారు. వారు స్వయం సదా తండ్రి గుణాలను మహిమ చేస్తారు. అందుకే ఎవరు ఎలా ఉన్నా సరే మీరు హృదయపూర్వకమైన స్నేహం ఇవ్వండి, శుభభావనను ఇవ్వండి, దయ చూపించండి.

6. నిర్మానచిత్త ఆత్మలు కారణాలను మరియు సమస్యలను పాజిటివ్ సమాధాన రూపంలోకి మారుస్తారు. వారి ముఖంపై ఎప్పుడూ నీరసం మరియు నాజూకుతనం యొక్క గుర్తులు ఉండవు, అందుకే నిర్మానులుగా కండి, నాజూకుగా కాదు. నీటి ఫలాన్ని కోమలం అని అంటారు. నీరు పోసినప్పుడు కొట్టుకుంటూ వెళ్ళిపోవడం లేక వాడిపోవడం అనేది జరగకూడదు.

7. నిర్మానులుగా అవ్వడమే స్వమానము మరియు ఇదే సర్వుల ద్వారా గౌరవం పొందేందుకు సహజ సాధనము. నిర్మానులుగా అవ్వడమంటే వంగడం కాదు కానీ సర్వులను తమ విశేషతలు మరియు ప్రేమ ముందు వంగేలా చేయడము. ఎంతగా నిర్మానులుగా ఉంటారో, అంతగానే సర్వుల హృదయాలలో మహానులుగా స్వతహాగా అవుతారు. నిర్మానత లేకుండా సర్వుల పట్ల మాస్టర్ సుఖదాతలుగా అవ్వలేరు. నిర్మానత సహజంగా నిరహంకారిగా తయారుచేస్తుంది. నిర్మానత అనే బీజము మహానత అనే ఫలాన్ని స్వతహాగా ప్రాప్తింపజేయిస్తుంది.

8. బాప్‌దాదా పిల్లలందరికీ విశేషమైన శ్రీమతం ఇస్తున్నారు – పిల్లలూ, మాటల్లో నిర్మానులుగా కండి. నిర్మానతయే మహానత. ఇది వంగడము కాదు కానీ అందరినీ తమ ఎదురుగా వంగేలా చేయడము. ఇదే ఆశీర్వాదాలను ప్రాప్తి చేసుకునేందుకు సాధనము. సత్యమైన సేవాధారికి ఎప్పుడూ సేవలో లభించే సఫలత గురించి అభిమానం ఉండదు. ఎంతగా సఫలత లభిస్తుందో, అంతగా నమ్రచిత్తులుగా, నిర్మానులుగా, నిర్మల స్వభావం కలవారిగా ఉంటారు.

9. ఏ వస్తువునైనా ముందు వేడి చేసి, తర్వాత మెత్తగా చేయడం జరుగుతుంది, ఆ తర్వాత మౌల్డ్ చేయడము (మలచడము) జరుగుతుంది. ఇక్కడ కూడా వేడి అనేది శక్తి రూపము మరియు మెత్తదనం అనేది నిర్మానత అనగా స్నేహ రూపము. ఎవరికైతే ప్రతి ఆత్మ పట్ల స్నేహం ఉంటుందో, వారే నమ్రచిత్తులుగా ఉండగలరు. స్నేహం లేకపోతే దయార్ద్ర హృదయులుగానూ ఉండలేరు, నమ్రచిత్తులుగానూ ఉండలేరు. శక్తి రూపంలో యజమానత్వము ఉంటుంది మరియు నమ్రతలో సేవా గుణం ఉంటుంది. ఎప్పుడైతే ఈ మెత్తదనం మరియు వేడి, రెండూ ఉంటాయో, అప్పుడే ప్రతి విషయంలో మౌల్డ్ అవ్వగలరు (మలచుకోగలరు).

10. బుద్ధిలో ఎంతగా తమ శ్రేష్ఠ స్వమానం యొక్క నషా ఉంటుందో, అంతగానే కర్మలలో సదా నమ్రత ఉంటుంది. ఉన్నతోన్నతమైన తండ్రి కూడా పిల్లల ఎదురుగా సేవాధారిగా వచ్చారు, ఇది నమ్రత అయినట్లు కదా! ఎంత ఉన్నతమైనవారో, అంతే నమ్రత కలిగి ఉండాలి – ఇటువంటి బ్యాలెన్స్ ఉండాలి ఎందుకంటే నమ్రత లేకుండా విశ్వ కళ్యాణం జరగజాలదు. ఎప్పుడైతే తండ్రి నమ్రతతో పిల్లలకు సేవాధారిగా అయ్యారో, అప్పుడే తండ్రిని కూడా తమవారిగా చేసుకున్నారు. ఇదే విధంగా ఫాలో ఫాదర్ చేయండి.

11. భాగ్యవంతులైన పిల్లలు ప్రతి సంకల్పంలో, మాటలో మరియు కర్మలో ఫాలో ఫాదర్ చేస్తారు. వారి ప్రతి మాటలో నమ్రత, నిర్మానత మరియు మహానత ఉంటాయి. ఎవరైతే స్వయాన్ని నిమిత్తులుగా భావిస్తారో, వారిలో మహానతతో పాటు నమ్రత తప్పకుండా ఉంటుంది. ఒకవేళ నమ్రత కన్నా మహానత ఎక్కువ ఉన్నా లేక మహానత కన్నా నమ్రత ఎక్కువ ఉన్నా, సఫలతా మూర్తులుగా అవ్వలేరు.

12. ఏ కర్మనైనా చేస్తున్నప్పుడు చేయించే తండ్రి యొక్క స్మృతి ఉన్నట్లయితే ప్రతి కర్మలో అతీతత్వము, నిరహంకారీతనము మరియు నమ్రతతో కూడిన నవ నిర్మాణం యొక్క శ్రేష్ఠత నిండి ఉంటాయి. ప్రతి క్షణము, ప్రతి సంకల్పము సంపూర్ణంగా పవిత్రంగా అనగా స్వచ్ఛంగా ఉంటాయి, దీనినే సత్యత మరియు స్వచ్ఛత అని అంటారు.

13. నమస్కరించడము అనగా వంగడము – ఎప్పుడైతే మీరు నమస్కరిస్తారో అప్పుడు అందరూ మీకు నమస్కరిస్తారు. మేమైతే సదా వంగుతూనే ఉంటాము కానీ మాకు ఏ గౌరవం లేదు మరియు ఎవరైతే వంగరో లేక అసత్యం మాట్లాడుతారో వారికే గౌరవం ఉంటుంది అని ఎప్పుడూ ఇలా అనుకోకండి – అలా కాదు. ఆ గౌరవం అల్పకాలికమైనది. మీరు దూరదృష్టితో కూడిన బుద్ధి కలిగి ఉండండి. ఇక్కడ ఎంతగా వంగుతారో అనగా నమ్రతా గుణాన్ని ధారణ చేస్తారో, అంతగా మొత్తం కల్పంలో సర్వాత్మలు మీ ఎదురుగా నమస్కరిస్తారు. సత్య-త్రేతాయుగాలలో రాజు పట్ల ఉన్న గౌరవానికి మనసుతో నమస్కరిస్తారు మరియు ద్వాపర-కలియుగాలలో తల వంచి నమస్కరిస్తారు.

14. ఏ విధంగా వృక్షం గురించి – ఎంత నిండుగా ఉంటుందో అంత వంగి ఉంటుంది అని అంటారు, అలా వృక్షం వంగడం వలన సేవ జరుగుతుంది. అదే విధంగా నిర్మాన ఆత్మలు అందరికీ సుఖమిచ్చే సేవను చేస్తారు. ఎక్కడికి వెళ్ళినా సరే, ఏమి చేసినా సరే వారు సుఖమిచ్చే వారిగా ఉంటారు. ఎంతగా స్వమానంలో ఉంటారో, అంతగా నిర్మానులుగా ఉంటారు. మేమైతే గొప్పవారిగా అయిపోయాము అనుకుంటూ, ఇతరులను తక్కువగా చూడడం లేక వారి పట్ల అయిష్ట భావన కలిగి ఉండడం అనేది చేయకూడదు.

15. శుభ భావన మరియు శుభ కామన యొక్క బీజమే – నిమిత్త భావము మరియు నిర్మాన భావము. వారు హద్దు యొక్క గౌరవం కోరుకోరు, నిర్మానులుగా ఉంటారు. ఎప్పుడూ కూడా సభ్యతను విడిచిపెట్టి సత్యతను నిరూపించవద్దు. సభ్యతకు గుర్తు నిర్మానత. ఈ నిర్మానత నిర్మాణ కార్యాన్ని సహజంగా చేస్తుంది. ఎప్పటివరకైతే నిర్మానులుగా అవ్వరో, అప్పటివరకు నిర్మాణమును చేయలేరు.

16. ప్రతి ఆత్మ పట్ల కళ్యాణ భావనతో కూడిన స్వభావము లేక దయా భావనతో కూడిన స్వభావము, ప్రతి ఆత్మను ఉన్నతిలోకి తీసుకువెళ్ళే స్వభావము, మధురతా స్వభావము, నిర్మానతా స్వభావము ధారణ చేయండి. ఈ స్వభావము మిమ్మల్ని సదా తేలికగా ఉంచుతుంది. ఎటువంటి భారము అనుభవమవ్వదు.

17. ఎవరైతే నిర్మానులుగా ఉంటారో, వారిలో అభిమానముతో కూడిన అధికారీతనము ఉండదు, ఆత్మికత యొక్క మెరుపు ఉంటుంది. ఏ విధంగా తండ్రి ఎంత నమ్రచిత్తులుగా అయి వస్తారో, స్వయాన్ని విశ్వ సేవాధారిగా భావిస్తూ పిల్లలను తమకన్నా ముందు ఉంచుతారో, అలా ఫాలో ఫాదర్ చేయండి. ఒకవేళ కొద్దిగానైనా సేవలో అభిమానము వచ్చినట్లయితే, ఆ సేవ సమాప్తమైపోతుంది.

18. నిరహంకారులుగా అయ్యారు అన్నదానికి విశేషమైన గుర్తు – నిర్మానత. వృత్తి, దృష్టి, వాణి, సంబంధ, సంపర్కాలు, అన్నింటిలోనూ నిర్మానతా గుణాన్ని ధారణ చేసినట్లయితే మహానులుగా అయిపోతారు. ఎవరైతే నిర్మానులుగా ఉంటారో, వారు సర్వుల నుండి గౌరవం పొందుతారు. స్వయం నిర్మానులుగా అయినట్లయితే ఇతరులు గౌరవం ఇస్తారు. ఎవరైతే అభిమానంలో ఉంటారో, వారికి ఎవరూ గౌరవం ఇవ్వరు, వారి నుండి దూరంగా పారిపోతారు.

19. సేవాధారి యొక్క విశేషత ఏమిటంటే – ఒకవైపు అతి నిర్మానులు, విశ్వ సేవాధారులు, మరొకవైపు జ్ఞానం యొక్క అథారిటీ కలవారు. ఎంత నిర్మానులో, అంతే నిశ్చింత చక్రవర్తులుగా ఉంటారు. వారిలో నిర్మానత మరియు అథారిటీ, ఈ రెండింటి బ్యాలెన్స్ ఉంటుంది. నిర్మాన భావము, నిమిత్త భావము, అనంతమైన భావము – ఇవే సేవలో సఫలతకు విశేష ఆధారము.

20. ఎంతగా స్వమానములో ఉంటారో, అంతే నిర్మానులుగా ఉంటారు. వారిలో స్వమానము యొక్క అభిమానము ఉండదు. మేమైతే గొప్పవారిగా అయిపోయాము అనుకుంటూ, ఇతరులను తక్కువగా చూడడం లేక వారి పట్ల అయిష్ట భావన కలిగి ఉండడం అనేది చేయకూడదు. ఎవరు ఎలాంటి ఆత్మలైనా సరే, వారిని దయా దృష్టితో చూడండి, అభిమానంతో కూడిన దృష్టితో కాదు. అభిమానమూ ఉండకూడదు, అవమానమూ కలగకూడదు. ఒకవేళ అభిమానము లేకపోతే, అవమానము అనేది అవమానముగా అనిపించదు. వారు సదా నిర్మాన మరియు నిర్మాణ కార్యములో బిజీగా ఉంటారు.

21. ఎవరైతే నిర్మానులుగా ఉంటారో, వారే నవ నిర్మాణము చేయగలరు. శుభ భావన మరియు శుభ కామన యొక్క బీజమే నిమిత్త భావము మరియు నిర్మాన భావము. వారు హద్దు యొక్క గౌరవం కోరుకోరు, నిర్మానులుగా ఉంటారు. అసభ్యతకు గుర్తు మొండితనము మరియు సభ్యతకు గుర్తు నిర్మానత. నిర్మానులుగా అయి సభ్యతాపూర్వకమైన వ్యవహారము చేయడమే సభ్యత మరియు సత్యత.

22. నమ్రచిత్తులు, నిర్మానులు మరియు హాజీ పాఠాన్ని పాటించే ఆత్మలు కొన్ని అపార్థాల కారణంగా అప్పుడప్పుడు ఓడిపోయినట్లుగా కనిపిస్తారు కానీ నిజానికి వారే విజయం పొందుతారు. కేవలం ఆ సమయంలో ఎవరో ఏదో అన్నందుకు లేక వాయుమండలం అలా ఉన్నందుకు స్వయం నిశ్చయబుద్ధి కలవారి నుండి మారిపోయి సంశయంలోకి రాకూడదు. ఇది గెలుపా, ఓటమా తెలియటం లేదు అని అనుకోకూడదు. ఈ సంశయం పెట్టుకోకుండా తమ నిశ్చయంలో పక్కాగా ఉండాలి. అప్పుడు దేనినైతే ఈ రోజు అందరూ ఓటమి అంటారో, వారే రేపు వాహ్–వాహ్ అనే పుష్పాలను అర్పిస్తారు.

23. సంస్కారాలలో నిర్మానత మరియు నిర్మాణము, ఈ రెండు విశేషతలు యజమానత్వానికి గుర్తులు. వీటితో పాటు, సర్వ ఆత్మల సంపర్కములోకి రావటము, స్నేహీలుగా అవ్వటము, సర్వుల హృదయాలలోని స్నేహపూర్వకమైన ఆశీర్వాదాలు అనగా శుభ భావనలు ఆ ఆత్మల పట్ల అందరి హృదయాల నుండి వెలువడుతాయి. తెలిసినవారైనా, తెలియనివారైనా, వారిని ఎవరు చూసినా సరే, ఆ స్నేహం కారణంగా – వీరు మా వారు అన్నట్లు అనుభవం చేయాలి.

24. సేవాధారి అనగా నిర్మాణము చేసేవారు మరియు నిర్మానులుగా ఉండేవారు. నిర్మానతయే సేవలో సఫలతకు సాధనము. నిర్మానులుగా ఉన్నట్లయితే సేవలో సదా తేలికగా ఉంటారు. నిర్మానులుగా ఉండకుండా గౌరవం కావాలనే కోరిక కలిగి ఉంటే అది భారమనిపిస్తుంది. భారం ఉన్నవారు సదా ఆగిపోతూ ఉంటారు, వేగంగా వెళ్ళలేరు. అందుకే ఒకవేళ ఏ రకమైన భారము కలుగుతున్నా, అక్కడ నిర్మానులుగా లేరు అని అర్థం చేసుకోండి.

25. బ్రహ్మాబాబా స్వయం ఎంతగా వంగి ఉండేవారు – ఎంత నిర్మానులుగా ఉంటూ సేవాధారిగా ఉండేవారంటే, వారు పాదాలు వత్తడానికి కూడా సిద్ధంగా ఉండేవారు. పిల్లలు నా కన్నా ముందు ఉన్నారు, పిల్లలు నా కన్నా బాగా భాషణ చేయగలరు అని అనేవారు. 'ముందు నేను' అని ఎప్పుడూ అనలేదు. పిల్లలు ముందు ఉండాలి, పిల్లలు మొదట ఉండాలి, పిల్లలు పెద్దవారు – ఇలా అంటూ స్వయం వంగడమంటే అది వంగిపోవడం కాదు, అది స్వయం ఉన్నతిలోకి వెళ్ళడము. ఇతరులకు గౌరవమిస్తూ స్వయం నిర్మానులుగా అవ్వడము – ఇదే పరోపకారము. ఇలా ఇవ్వడమంటే సదా కోసం తీసుకోవడము.

26. అల్పకాలికమైన వినాశీ గౌరవాన్ని త్యాగం చేసి స్వమానంలో స్థితులై, నిర్మానులుగా అయి, గౌరవాన్ని ఇస్తూ వెళ్ళండి. ఈ ఇవ్వడమే తీసుకోవడమవుతుంది. గౌరవం ఇవ్వడమంటే ఆ ఆత్మను ఉల్లాస-ఉత్సాహాలలోకి తీసుకువచ్చి ముందుంచడము. ఈ సదాకాలికమైన ఉల్లాస-ఉత్సాహాలు అనగా సంతోషమనే ఖజానా లేక స్వయం యొక్క సహయోగమనే ఖజానా, ఆత్మను సదా కొరకు పుణ్యాత్మగా చేస్తాయి.

27. ప్రతి సమయము నమ్రతా డ్రస్సును ధరించి ఉండండి. ఈ నమ్రత అనేది కవచము. ఇదే రక్షణా సాధనము. ఎక్కడైతే నమ్రత ఉంటుందో, అక్కడ స్నేహము మరియు సహయోగము తప్పకుండా ఉంటాయి. సత్యమైన నషాలో ఉండేవారు సదా నమ్రచిత్తులుగా ఉంటారు. నమ్రతతోనే అందరినీ తమ ఎదురుగా వంగేలా చేయగలరు. నమ్రచిత్త ఆత్మ సుఖదాతగా అవ్వగలరు.

28. సదా ఆత్మికతలో ఉంటూ సేవ చేసినట్లయితే ముఖముపై ఆత్మిక నషా కనిపిస్తుంది. ఆత్మిక నషాలో ఉండేవారు నమ్రచిత్తులుగా ఉంటారు మరియు నిర్మాణ కార్యాన్ని చేస్తారు. ఏ విధంగా తండ్రి ఎంతో నమ్రచిత్తులై వస్తారో, అలా ఫాలో ఫాదర్ చేయండి. సేవలో ముందుకు వెళ్ళే కొలది వృత్తి, దృష్టి, మాట మరియు నడవడికలో నిర్మానత కనిపించాలి, దీని ద్వారానే బాప్‌దాదా నుండి మరియు చిన్న-పెద్ద అందరి నుండి ఆశీర్వాదాలు లభిస్తాయి, ఇవే సఫలతను అందిస్తాయి.

29. నేను నిమిత్త ఆత్మను అని భావించినట్లయితే రెండు విశేషతలు సాకార రూపంలో కనిపిస్తాయి – 1. సదా నమ్రత ద్వారా నిర్మాణము చేస్తూ ఉంటారు. 2. సంతుష్టతా ఫలాన్ని తింటూ మరియు తినిపిస్తూ ఉంటారు. నేను నిమిత్తుడిని – దీని ద్వారా అతీతముగా మరియు తండ్రికి ప్రియముగా ఉన్నట్లు అనుభవం చేస్తారు. ఇక "నేను" అన్న పదము సమాప్తమైపోతుంది. "నేను" అన్నదానికి బదులుగా బాబా-బాబా అని అన్నట్లయితే అందరి బుద్ధి తండ్రి వైపుకు వెళ్తుంది మరియు విశేష శక్తిని అనుభవం చేస్తారు.

30. నమ్రత మరియు దయా భావన అనేవి అభిమానము యొక్క అనుభవం కలిగించవు. ఏ విధంగా మురళీలు విన్నప్పుడు వాటిలో అథారిటీతో కూడిన మాటలు ఉంటాయి కానీ అవి అభిమానంతో కూడినవిగా అనిపించవు. కావున పదాలు ఎంత ఖచ్చితమైనవి ఉన్నా కానీ అవి అభిమానంతో కూడినవిగా అనిపించకూడదు. ఎంత అథారిటీయో, అంతే నమ్రత మరియు దయా భావము ఉండాలి.

31. చాలా మంది పిల్లలు దేహాభిమానము కారణంగా పదే-పదే – 'నేను' ఇలా అనుకుంటున్నాను, 'నేను' ఏదైతే చెప్పానో అదే రైట్, 'నేను' ఏదైతే ఆలోచించానో అదే రైట్ అని అంటారు. ఈ రాయల్ రూపంలోని 'నేను' అనేది నమ్రచిత్తులుగా అవ్వనివ్వదు. ఈ 'నేను' అనేది బలహీనంగా చేస్తుంది. బలహీన ఆత్మ అంటుంది- నేనైతే ఇంత సహనం చేయలేను, ఇంత నిర్మానంగా అయితే అవ్వలేను, ఇన్ని సమస్యలను దాటలేను. అందుకే ముందు 'నేను'-'నేను' అన్నదానిని బలిహారం చేయండి, అప్పుడు విశ్వ నవ నిర్మాణ కార్యాన్ని సంపన్నం చేయగలరు.